**జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ వారి కథల పోటీలో ప్రోత్సాహ బహుమతి పొందిన కథ**

# నిదురపోవల్లగా!

**ఎం.ఆర్. అరుణకుమారి**

"పెండ్లి చేసి ఒకాయన చేతిలో పెట్టాల్సిన వయసులో, పనికి పంపాల్సిన దౌర్భాగ్యం పట్టింది. నన్ను మన్నించు తల్లీ!"

తండ్రి గుడ్ల నీరు కుక్కుకున్నాడు గుండె లోనే. ఆర్తి లేని గొంతు నిర్వేదంగా... పీలగా.. బోలుగా.. పలికింది.

"భద్రమమ్మా! కష్టమో, నష్టమో... వాళ్లు చెప్పినట్లు విని పని బాగా చేసి.. పైసలు భద్రం చేసుకో! ఒళ్లు కూడా..."

ఫక్కుమన్న కూతురి నవ్వు, ఆ తల్లి గొంతు నొక్కింది. చిన్నబోయిన వదనాలతో తల్లిదండ్రులు ఒకర్నొకరు చూసుకొన్నారు. ఆ చూపుల్లో నిందలు, నిష్ఠురాలు లేవు. పరిస్థితులు కల్గించిన నిస్సహాయత, అసహాయత మిగిల్చిన న్యూనత తప్ప!

విషాదమంతా తనదే! కష్టపడి పని చెయ్యాలి. డబ్బు సంపాదించాలి. తిండికి కటకటలాడుతున్న కుటుంబాన్ని ఆకలిచావులు చావకుండా కాపాడాలి. మరి తనను ఎవరు కాపాడుతారు? 'నీ కోసం నేనున్నా'ననే వారెవరు? ఈత వచ్చినా వరద గోదార్లో దూకే సాహస ముండద్దా?

"రఘూ, కూలి చేసుకు బతకలేమా? మనం ఏ తిరపతో, కాణిపాకమో వెళ్లి పెళ్లి చేసుకొందాం. కాదనకు ప్లీజ్! నేను పూనా వెళ్తాను."

"మనిద్దరమే బతకడం కాదు గదా,ఇప్పుడు మన ముందున్న సమస్య, మన కుటుంబాలనూ బతికించుకోవడం! ఆడదానివి. అందగత్తెవు. నీకు పనన్నా దొరుకుతుంది. నాకే.. ఏ ఆధారమూ లేదు. నిన్ను పెళ్లాడి.. ప్స్! సారీ! మన దారులు వేరైనాయి. ఇవి కలిసే పట్టాలు కావులే!" రఘు కదా! కాబట్టే స్పష్టంగా చెప్పేశాడు.

ప్రేమ 'తడా'రిపోయి గుండె రాయి అయిపోయింది. మనసే లేని శరీరం. ఏ విధంగా, ఆకలి పులిని ఎదుర్కొనే చలి మంటగా మండుతోంది. నిర్దాక్షిణ్యంగా.. నిర్లక్ష్యంగా... నిర్లిప్తంగా!

** ** **

"నిర్లక్ష్యానికి తగిన ఫలితం అనుభవించక తప్పదు." జాలి, సానుభూతి ఎరగని కఠినస్వరం.

"చిలక్కి చెప్పినట్లు చెప్తాను కదా! ఐనా ఎందుకంత నిర్లక్ష్యం?"


"మేం చెప్తే విన్పించుకుంటే గదా?"

"విన్పించుకోకపోతే కాదనలేరా?"

హు! కాదంటే వదిలేస్తారా? తాగుడు మత్తు, కండకావరం, కైపు మదం.. పైశాచిక ఆనందం. ఊపిరి సలపనివ్వని.. శరీరం హూనమయ్యే వికృత శాడిజం! తమగోడు అరణ్యరోదనే! పై ఎల విని యోగానికి రాక్షసానందవినిమయం జరగాలి కదా! కానీ తామిచ్చే సుఖానికి మాత్రం అనారోగ్యమే ఫలితమా?

"రేపు బయల్దేరు. టికెట్ రిజర్వ్ చేయిస్తాను" మరణశాసనం! "వద్దమ్మా! డాక్టరుకు చూపించండి. నేను పని చెయ్యకపోతే మా కుటుంబమంతా కట్ట గట్టుకు చావాల్సిందే!" వేదన సుడిగుండాలు.

"డాక్టరే కదా చెప్పండి నువ్విక 'పనికి'రావని!



"

"లేదమ్మా! చచ్చే దాకా నేను పని చెయ్యక తప్పదు."

"అవతలివాళ్లను చంపుతూనా? నో! నో! నేనొప్పుకోను. నా మీద కష్టమర్ల కున్న నమ్మకాన్ని నీ కోసం పోగొట్టుకోమంటావా?"

"మరి మేం కూడా మీ మీద నమ్మకం తోనే కదా, మా జీవితాల్నే మీ చేతుల్లో పెట్టాం?"

"ఓ! చదువుకొన్నదానివి కదా! తెలివిగానే మాట్లాడుతున్నావు. నేను నా సరుకు పట్ల తీసుకొనే జాగ్రత్త మీరూ తీసుకోవాలి. ఆ బాధ్యత మీదే, నాది కాదు. ఇహ మీరు నన్ను నమ్మినందుకు నేనేం మీకు అన్యాయం చెయ్యలేదే! మీ కష్టానికి తగిన ప్రతిఫలాన్ని మోసగించనూ లేదే?" తీవ్రకంఠస్వరం భయాన్ని కల్గిస్తోంది.

"నిజమేనమ్మా! మీరేం చెయ్యలేదు. మా పరిస్థితులు, స్వయానా మా తల్లిదండ్రులే మాకు అన్యాయం చేశారు. మేం ఆత్మవంచనతోనే బతుకుతున్నాం. కానీ బతుకే లేదనడం అన్యాయం కాదామ్మా?"

"స్వయంకృతాపరాధానికి నన్ను నిందించటం మాత్రం న్యాయమా? నాకు కొన్ని పాలసీలున్నాయి. పరువుప్రతిష్ఠలు, మంచి పేరూ ఉన్నాయి. ఏ ఒక్కరి కోసమో.. ఏ ఒక్కటీ వదులుకోను. నువ్విక్కడ్నుంచి వెళ్లిపోక తప్పదు. వచ్చావు. ఆదరవు కల్పించాను. ఏదో బతుకుతావు. మీ కుటుంబమూ గట్టెక్కుతుందనుకొన్నా! ఇలా జరగడం నీ దురదృష్టమే! మందే లేని వైద్యం ఏ డాక్టరు చెయ్యగలడు? సరే! నీ వల్ల నేను లాభపడిందేమీ లేకపోయినా సరే, వెయ్యి రూపాయలిస్తాను. మీ ఊరే వెళ్తావో, ఇంకెక్కడికన్నా వెళ్తావో, ఏం పని చేసుకొంటావో, నీ ఇష్టం!"

ఇష్టం! ఫక్కుమనాలనిపించింది. తన ఇష్టాలెన్నో... ఎన్నెన్నో చంపుకొంటూ వస్తున్నవే కదా, చిన్నప్పట్నుంచీ! రఘు.. ప్రేమ.. పెళ్లి.. పూనా ప్రయాణం... అలుపెరుగని పని ఒత్తిడి... అనారోగ్యం!

"ఒళ్లు భద్రమమ్మా!" అమ్మ పలుకులు గుండెను గుచ్చుతున్న ములుకులు. తిరిగి ఇంటికి.. ఊహూ! భూమికి భారంగా బతకొచ్చు గానీ, కుటుంబానికి బరువు కాకూడదు. ఆ నరకం తను పడలేదు. దాని కన్నా ఇక్కడి యాతనే నయం. దారెటూ ఉంది. ఓపికున్నన్ని నాళ్లు, కుప్ప కూలే దాకా, కుప్ప బూడిదగా మారే దాకా. చివరి క్షణం దాకా నడవక తప్పనిసరి పరిస్థితి. తన కుటుంబంలోని పదిమందిని బతికించటానికి తనొక్కతి చస్తేనేం? వేదనా మేఘాలు వర్షిస్తున్న కన్నీళ్లు! తుడిచే ఆత్మీయహస్తం. శూన్యమైనపుడు, స్థైర్యం, పోరాటపటిమ పెంచుకోక తప్పదు. గెలుపో, ఓటమో-సమరం మాత్రం తప్పనిసరే!

** ** **

"కుటుంబంలో పదిమందీ చావటం కన్నా, నిన్నొక్కదాన్నే బలిపశువును చెయ్యక తప్పని నా పరిస్థితిని నువ్వర్థం చేసుకొంటావనే అనుకుంటున్నాను."

"నువ్వా.. నువ్వసలు.. అమ్మవేనా?"

లేక ఆక్రోశం పట్టించుకునే ఆర్ద్రతను ఆకలి

మంటలెప్పుడో ఆహుతి చేసేసుసున్నాయి. అనుభవాలు. అవసరాలు మనిషిని రాటు దేలుస్తాయి.

"పోనీ.. వేరే మార్గమేమన్నా ఉంటే చెప్పు. అలాగే చేద్దాం."

"మా..." ఎగిసిపడుతున్న కన్నీటి కెరటాలు.

"కన్నీళ్లు సమస్యను పరిష్కరించలేవని నీకు తెలీదా షబ్నా? వాటికే గనుక అలాంటి శక్తి వుండుంటే, పెళ్లయిన కాణ్నించీ, నేను కార్చిన కన్నీటి ప్రవాహంలో మన కష్టాలన్నీ కొట్టుకుపోయుండేవి కాదా?"

"........ ........"

"చెప్పు షబ్నా! సుఖాలు, సంతోషాలు పక్కన పెట్టు. ఏ రోజన్నా మూడు పూటలా కడుపు నిండా తిన్నామా? సరే! అరకొరతిండి, చిరుగులో, మాసికలో... బట్టలూ... సర్దుకొంటూనే వచ్చామిన్నాళ్లు! మీ అబ్బాజాన్ చచ్చే దాకా! చచ్చినోడు, ఊరికినే చచ్చాడా? తన రోగాన్ని నాకు ఆస్తిగా యిచ్చి చచ్చాడు. ఇహ నేనెన్ని దినాలు బతుకుతానో, మీకు దిక్కెవరు? నువ్వన్నా ఒకింటి దానివైతే, ఆ ఆధారంతో మిగతావాళ్లను ఆదుకొంటావుకదా.."

"మన సలీమ్ మనల్నంతా బాగా చూసుకొంటానంటున్నాడు కదా!"

"ఆc! సలీం! గొప్ప ప్రేమికుడులే! వాడూ మీ అబ్బాజాన్ లాగే లారీ డ్రైవరేగా! వాణ్ని నమ్మితే, నా గతే నీకూనూ!"

"మరి ఎవడో.. ముక్కూ మొహం తెలీని షేకును మాత్రం ఎలా నమ్మగలం?"

"అతను షేకు కాబట్టి. అతని దగ్గర డబ్బుంది కాబట్టి."

"హుc! డబ్బుంటే మాత్రం, సుఖపడిపోతామా? కనీసం.. నేను?"

"ఆc! నీ అదృష్టం ఎలా ఉన్నా, మన పరిస్థితి మెరుగవుతుంది కదా?"

"అనేంటి నమ్మకం?"

"నీ..." నిట్టూర్పు నాపుకొన్న నిబ్బరం.

"అందం."

"అంటే?" ఆశ్చర్యంతో విచ్చుకున్న కళ్లు.

"నన్ను.. నన్ను... అమ్మేస్తావా?"

"వితండవాదం చెయ్యకు షబ్నా! డబ్బు పోసి మొగుళ్లను కొనుక్కొంటున్న వాళ్లంతా సుఖపడ్తున్నారా! సంతోషంగా ఉన్నారా? కనీసం ప్రాణాలతో బతికున్నారా?"

"ఓ! ఐతే.. డబ్బు కోసం.. ముసలి షేకు మూణ్నాళ్ల ముచ్చట తీర్చే 'నిక్కా' పేరుతో నన్ను అమ్మడానికే నిశ్చయించుకున్నావన్న మాట!"

"అమ్మ నిర్ణయం అమ్మ కోసం కాదు, నీ తోబుట్టువుల కోసమేనని నువ్వర్థం చేసుకుంటే ఇంటి పెద్ద కూతురుగా. ఇది నీ తప్పనిసరి బాధ్యతనీ."

"హుc! నువ్వు, నీ మొగుడు అనుభవించిన సుఖానికి... నా బతుకు బలి చెయ్యటమే బాధ్యతా?"

"షబ్నా! అమ్మననవలసిన మాటలేనా?"

"అమ్మ?!?" వేదనో, హేళనో.. ఫక్కుమంది.

"అమ్మనయ్యే రాతే గనుక నాకుంటే, అమ్మ ఎలా వుండాలో చూపిస్తా!"

"నాకు తెలుసు బేటీ!" కన్నీళ్లు ఎగసి పడ్డాయి. "ప్రేమ కన్నా పరిస్థితులే మనిషి బాని సన్న విషయం, నీ అనుభవానికొస్తే గానీ తెలీదు. ఏమైనా సరే, చివరి దినాలు నిదర పోనీ నన్ను... హాయిగా... చల్లగా!"

** ** **

అమీనా!

బేటీ.. నా చిన్నారి బేటీ. ఎలా ఉంది? నేనిక్కడున్నానే గానీ, నా మనసు... ప్రాణం... దాని దగ్గరే ఉన్నాయి. నా కోసం బెంగ పెట్టుకొని ఏడుస్తోందా? పాలన్నా తాగుతోందా, లేదా? పసిగుడ్డును వదలి.. ఇలా దూరంగా ఉండాల్సిన నా కర్మ. ఏ తల్లికీ వొద్దీ శిక్ష! 'అవసరాలు కన్న ప్రేమను కూడా లొంగదీసుకుంటా'యన్న అమ్మ మాటలు గుర్తొస్తుంటాయి. అమ్మ కూడా



పాపం, ఎక్కడుందో, స్వర్గంలోనే ఉండుంటుంది. అనుభవించాల్సిన నరకమంతా ఇక్కడే పడింది కదా!

అమీనా! నిన్నో అయ్య చేతిలో పెట్టి (ఏ షేకు చేతిలోనో పెట్టి నా జీవితం కుక్కలు చింపిన విస్తరి కానియ్యకూడదనే కదా... నా కన్నబిడ్డను నీ చేతుల్లో పెట్టి నేనే పూనాకొచ్చాను), రషీద్ చదువైపోతే, అమ్మ నాపైన పెట్టిన బాధ్యతలన్నీ తీరిపోతాయి. కానీ నా బాధ్యత, నా మీదున్న నా బిడ్డ బాధ్యత మాత్రం నువ్వే తీసుకోవాలి. అవును అమీనా! పది నెలలు మోసి కన్నానన్న మాటే గాని, కనీసం పది నెలలు కూడా నిండ కనే... దానికి దూరమవ్వాల్సిన అదృష్టాన్ని మూట గట్టుకొన్న ఈ దౌర్భాగ్యపు తల్లి, త్వరలోనే శాశ్వతంగా దూరమవ్వాల్సిందేనన్న భయంకరసతం తెలిసి తెలిసీ, పగిలిన గుండెను చిక్కబట్టుకొని.. రాత్రింబవళ్లు పని చేస్తున్నా, మీ కోసం!

'తల్లి రాత బిడ్డకు' అంటారు. మన అమ్మ రాతే.. నాకు! కానీ నా రాత నా బిడ్డకు రాకుండా నువ్వు జాగ్రత్తగా పెంచుతావు కదూ? అమీనా! ఒంట్లో సత్తువ ఏ మాత్రం లేదు, రోగంతో పోరాడ్డానికి! బతుకు కాలాన్ని కొంచెమైనా పెంచే మందుల కోసం డబ్బు వృథా చెయ్యదల్చుకోలేదు. జీవనపోరాటంలో బాగా అలసిపోయాయి, నా మనశ్శరీరాలు! త్వరలోనే వచ్చేస్తాను. మీ అందరి మధ్యా హాయిగా.. చల్లగా .. నిదుర'పోవడానికి!

"మరి ఉండనా?

"మీ అక్క,

"షబ్నా."

** ** **

"ఏమ్మా! సౌదీకి పొయ్యొచ్చిన కాణ్నించీ నీ ఎవ్వారమే మారిపోయుండాది. ఐదేండ్లాయ. చెయ్యేస్తే యిసిరిసిరి కొడ్తావేందీ! నేనూ చూస్తానా వుండా, పద్దెనాలుగా! మాటాడితే చాలు, ఐదేండ్లుండ్లేదా అంటావు. నిన్ను బలవంతంగా అంపించిననని కోపమింగా తగ్గలేదా?"

"పేదోల్ల కోపాలు పెదాలకు సేటే గానీ... పన్నయితాయా? పోబట్టే కదా, ఈ పొద్దీ మిద్దింట్లో ఉండాం. బిడ్డల కిద్దర్కీ మంచి సంబంధాలు చేస్తిమి. పిల్లోడు లచ్చనంగా ఆస్టల్లో సదవతాండాడు."

"ఔకదా మల్లా! మళ్లయితే నా మీద కోప మేల? దా!"

"ఒద్దొద్దు. వొదులు బా!"

"ఏమ్మే... దీన్నిమ్మా.. నకరాలు చేస్తుండావు. ఆడెవుర్నన్నా.. మరిగినావా ఏంది? దొంగ లంజా..."

"లంజా?!?" ఆవేశమో.. ఆవేదనో.. ఫక్కుమంది.

"ఐతే.. నువ్వీడ పాపం... మడి గట్టుకొనే వున్నావా ఐదేండ్ల మట్టీ?"

"ఉన్నా... వా.. అంటే.. వుండాను.. గదా!"

తప్పే తడబడుతుంది కదా!

"అబ్బా!"

"ఎటకారమా? సరే.. నేను మగోణ్ని!"

ఎదురు దబాయించే ధీమా!

"ఓయబ్బో!" వెక్కిరింపు.

"ఏమ్మే! మన... ముగ్గురు బిడ్లు... నాకు పుట్టేదా?" అనుమానం దారంతోనే కదా కుప్పె కట్టేది!

"బిడ్లు పుట్టిస్తే మగోడే! పెండ్లాం బిడ్లను సాకకపోతే గదా మొగుడంటే!"

"పరిస్థితులన్నీ... తెల్సి.. నువ్విట్టా మాటాడితే.. అలిగితే ఎట్లా? దా! దా... ఎన్నేండ్లాయి.. రమ్మంటుంటే..!"

"పరిస్థితి తెల్సు గన్కా... వద్దంటుండానని నీకు తెల్వద్దా?" గుండె చీల్చుకొన్న కన్నీళ్లు! బడబాగ్నులు చిమ్ముతున్న కన్నీళ్లు!

"ఔను బా! ఇంకెన్ని దినాలు బతకతానో... ఏమ్మందులిచ్చి బతికించాలో డాక్టర్లకే తెలీని రోగమొచ్చే! ఇక బతికినన్ని దినాలన్నా... సొంతూర్లో.. అయినోల్ల మద్దిన ఉండి... 'పోవల్లనీ... వొచ్చేస్తి. రెయ్యింబగల్లు... కష్టపడి.. పని.. ప..ని.. చేసి చేసీ.. అలిసిపోతి బా! నీ ఒళ్లో... పండుకోనీ బా! సల్లంగా.. హాయిగా.. నిద్దరోనీ.. నిద్దరోనీ!"